క్లుప్తంగా

నవ ధాన్యాలతో భూసారం



అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి గురుమూర్తి

డెంకాడ: నవ ధాన్యాలు సాగు చేయడం వల్ల భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ప్రతినిధి గురుమూర్తి అన్నారు. మండలంలోని సింగవరంలో నవధాన్యాల సాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నవధాన్యాల సాగుతో నేల సారవంతమై, ఎరువుల ఖర్చు తగ్గుతుందని వివరించారు. ఖరీఫ్‌కు రెండు నెలల ముందు పచ్చిరొట్ట ఎరువులు చల్లుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా డెంకాడ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని ఏపీ ట్రాన్స్‌కో ఈఈ ఎస్.కృష్ణమూర్తి, ఏఈ పి. అప్పలస్వామినాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డెంకాడ, గుణుపూరు, గుణుపూరుపేట, ముంగినాపల్లి, డి.కొల్లాం, బొల్లంగిపేట, డీఆర్‌పాలెం, నగరపుపేట, పోతయ్యపాలెం, పెదతాడివాడ, పినతాడివాడ, గొడిపాలెం, వెదుళ్లవలస, దొడ్డిబాడువ, చందకపేట, లెంకపేట, సింగవరం, మహంతిపేట, నాతవలస గ్రామాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

భోగాపురంలో...

భోగాపురం: మండలంలోని సవరవిల్లి, రామచంద్రపేట, కొండ్రాజుపాలెం, ముక్కాం, సబ్బన్నపేట, చేపలకంచేరు, బమ్మిడిపేట, నందిగాం, చోడిపిల్లిపేట, భోగాపురం, కొంగవానిపాలెం, దిబ్బలపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జ్ఞానేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పందులను నిర్మూలించరూ..



మండల పరిషత్ ప్రాంగణంలో సంచరిస్తున్న పందులు

నెల్లిమర్ల: స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో పందుల సంచారాన్ని నిర్మూలించాలని ఉద్యోగులు, సందర్శకులు కోరుతున్నారు. ఇటీవల గుర్తు తెలియని కొంతమంది వ్యక్తులు ఎక్కువ సంఖ్యలో పందులను తీసుకొచ్చి కార్యాలయ సమీపంలో విడిచిపెట్టారు. దీంతో పరిసరాలను పాడు చేస్తున్నామని, అలాగే చిన్నారులపై కూడా దాడులు చేస్తున్నాయని స్థానికుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పందులను నిర్మూలించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆడపిల్లలకు అండగా..

విజయనగరం ఫోర్ట్: ఆడపిల్లలకు అన్ని విధలా అండగా నిలవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి.శాంతకుమారి అన్నారు. స్థానిక దాసన్నపేట కేజీబీవీలో బాలికలను రక్షించండి, బాలికలను కాపాడండి అనే అంశంపై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ, బాలికలు ఉన్నత కోర్సులు చదవాలన్నారు. ఆడపిల్లలకు 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహాలు చేయాలని, ఈ విషయంలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి బాలికలు తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ వైద్యాధికారి డి. పల్లవి, డెమో విభాగం హెల్త్ ఎడ్యుకేటర్ పి. సుబ్బలక్ష్మి, పవన్ ఆశిష్, తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్ అందజేత



బాధితుడికి బ్యాగ్ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

విజయనగరం టౌన్: బస్సులో మరిచిపోయిన బ్యాగ్‌ను బాధితుడికి ఆర్టీసీ అధికారులు అప్పగించి తమ నిజాయితీ నిరూపించుకున్నారు. వివరాల్లోకి వెళితే.. సత్యనారాయణ అనే ప్రయాణికుడు తన కుమార్తెతో కలిసి గురువారం ఆర్టీసీ బస్సులో విశాఖ నుంచి విజయనగరం వచ్చారు. ఈ క్రమంలో ల్యాప్‌టాప్ బ్యాగ్‌ను బస్సులో మరిచిపోయారు. ఆర్టీసీ సిబ్బంది బస్సులో ఉన్న బ్యాగ్‌ను గుర్తించి, అధికారులు అప్పగించారు. దీంతో అధికారులు టికెట్ ఆధారంగా వివరాలు సేకరించి బాధితుడికి బ్యాగ్ అప్పగించారు.

ఎస్సీ,ఎస్టీల ఆర్థిక 'ఉన్నతి' లక్ష్యం

- మహిళలకు స్వయం ఉపాధి రుణాలు
- సద్వినియోగం చేసుకుంటున్న లబ్ధిదారులు



నెల్లిమర్ల మండలం పెదబూరాడపేటలో పేపర్ ప్లేట్ల వ్యాపారం నిర్వహిస్తున్న పూసరి రామయ్యమ్మ



దొడ్డిబాడువలో పాల డెయిరీ నిర్వహిస్తున్న కోరాడ రామతల్లి

మండలాల వారీగా ఉన్నతి ద్వారా అందించిన రుణాలు

మండలం	రుణం పొందిన లబ్ధిదారులు	అందించిన మొత్తం (రూ.లక్షల్లో)
డెంకాడ	137	రూ.67.90
నెల్లిమర్ల	64	రూ.27.80
భోగాపురం	95	రూ. 46.10
పూసపాటిరేగ	109	రూ. 52.65

డెంకాడ: ఎస్సీ,ఎస్టీ పొదుపు సంఘాల మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు 'ఉన్నతి' (ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు) ద్వారా రుణాలు అందిస్తున్నారు. పొదుపు సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన మహిళలు సొంతంగా చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రుణ సదుపాయం కల్పిస్తోంది. ఒక్కో సభ్యురాలికి రూ. 50 వేల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నారు. లబ్ధిదారులు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా, వారికి ఆసక్తి ఉన్న చిరు వ్యాపారాలు, పాడి పశువులు డెయిరీ నిర్వహణ, తదితర రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. నెల్లిమర్ల నియోజకవర్గంలోని డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు సంబంధించి మొత్తం 405 మంది మహిళలకు 194.45 లక్షల రూపాయల రుణాలను మంజూరు చేశారు. ప్రస్తుతం రుణాలు పొందిన మహిళలందరూ చిరు వ్యాపారులతో కుటుంబాలను నెట్టుకురావడం అభినందనీయం.

ఒక మంచి లక్ష్యంతో..



ప్రభుత్వం పొదుపు సంఘాల్లోని ఎస్సీ, ఎస్టీ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. ఉన్నతి ద్వారా ఒక్కో మహిళకు రూ.50 వేల వరకు రుణం మంజూరు చేస్తున్నాం. వీటిని చాలా మంది లబ్ధిదారులు వినియోగించుకుంటూ వ్యాపారాలు చేసుకుంటున్నారు.

– ఎస్.రాజ్‌కుమార్,వైఎస్సార్ క్రాంతిపథం, ఏరియా కో ఆర్డినేటర్

స్వయం ఉపాధి..



'ఉన్నతి' ద్వారా రుణం తీసుకున్నాను. విశాఖ డెయిరీ యూనిట్ నిర్వహణతో పాటు పాడి పశువులను కూడా కొన్నాను. దీంతో పాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటు డెయిరీ నిర్వహణ ద్వారా కూడా ఆదాయం వస్తోంది. కుటుంబాన్ని పోషించుకుంటూ ఆనందంగా ఉన్నాను.

– కోరాడ రామతల్లి, పొదుపు సంఘం మహిళ, దొడ్డిబాడువ

అభివృద్ధిని చూసి ఓటేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును అత్యధిక మెజార్టీతో గెలిపించాలి
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు సూరిబాబు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన అభివృద్ధిని చూసి పార్టీ మద్దతుతో ఎమ్మెల్సీ బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ పరిశీలకుడు అందవరపు సూరిబాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పట్టభద్రులను నేరుగా కలిసి ఓటును అభ్యర్థించాలన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు చాలా కీలకమన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో ఏవిధంగా పనిచేశారో అదే విధంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పనిచేయాలని సూచించారు. ఒక్కో నాయకుడు వందమంది పట్టభద్రులను కలవాలన్నారు. వారికి నవరత్నాలు పథకాలతో పాటు సచివాలయ వ్యవస్థ, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై అవగాహన కల్పించాలని తెలిపారు. 'నాడు – నేడు' ద్వారా కోట్లాది రూపాయలతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేసిన విషయం ఓటర్లందరికీ తెలియజేయాలని చెప్పారు. సమావేశంలో ఎంపీపీలు అంబళ్ల సుధారాణి, బంటుపల్లి వాసుదేవరావు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, చనుమల్ల వెంకటరమణ, అంబళ్ల శ్రీరాములనాయుడు, మహంతి జనార్దనరావు, మహంతి శ్రీనివాసరావు, రేగాన శ్రీనివాసరావు, చిక్కాల సాంబశివరావు, పి.లక్ష్మీనారాయణ, ఎన్.సత్యనారాయణరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర రాష్ట్ర సాధనే లక్ష్యం

- ఉత్తరాంధ్ర పార్టీ అధ్యక్షుడు మెట్ట రామారావు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర పార్టీ వ్యవస్థాపకుడు మెట్ట సత్యనారాయణ, పక్కన జనార్దనరావు

విజయనగరం గంటస్తంభం: ఇచ్ఛాపురం నుంచి గోదావరి గట్టు వరకు ఒకప్పటి ఉత్తరాంధ్ర ప్రాంతం ఒక రాష్ట్రంగా సాధించాలన్నదే తమ లక్ష్యమని ఉత్తరాంధ్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మెట్ట రామారావు అన్నారు. ఉడా కాలనీలో పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయని చెప్పారు. తూర్పు కనుమలు మొత్తం ఉత్తరాంధ్ర ప్రాంతంలోనే ఉన్నాయని, సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం ఉత్తరాంధ్ర సొంతమన్నారు. ఇన్ని అవకాశాలు ఉన్నప్పుడు గిరిజనులు, ఆదివాసీలకు ఇబ్బంది లేకుండా పర్యాటకంగా ఇతర మార్గాల ద్వారా ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేయవచ్చని చెప్పారు. కాని ఉత్తరాంధ్ర ప్రాంతంపై ఇంతవరకు ఉన్న మద్రాస్ ప్రాంత పాలకులు గాని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పాలకులు గాని ఇప్పుడు ఉన్న ఆంధ్ర రాష్ట్ర పాలకులు గాని పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నారా చంద్రబాబునాయుడు గాని జగన్ మోహన్‌రెడ్డి గాని రాయలసీమను అభివృద్ధి చేశారే తప్ప ఉత్తరాంధ్రను పట్టించుకోలేదని ఆరోపించారు. అదే మన ప్రాంత నాయకులు ముఖ్యమంత్రులుగా ఉంటే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుందన్నారు. అదే లక్ష్యంతో ఉత్తరాంధ్ర పార్టీ స్థాపన జరిగిందని.. ఈ విషయం ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తీసుకు వస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పార్టీ ఉమ్మడి విజయనగరం జిల్లా ఇన్‌చార్జి పేడాడ జనార్దనరావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

దూబే మృతి పార్టీకి తీరని లోటు

- పాడె మోసిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల



పాడె మోస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వైఎస్సార్‌సీపీ పట్టణ నాయకుడు, కంటోన్మెంట్ జోన్ ఇన్‌చార్జ్ వినోద్‌కుమార్ దూబే మృతి పార్టీకి తీరని లోటని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. దూబే అంత్యక్రియలు కొత్తపేట శ్మశానవాటికలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, సన్నిహితుల మధ్య గురువారం జరిగాయి. దూబే మరణవార్త తెలిసిన వెంటనే తిరుపతిలో ఉన్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల హుటాహుటిన బయలుదేరి గురువారం ఉదయానికే పట్టణానికి చేరుకున్నారు. దూబే మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. దూబే తనకు అత్యంత ఆప్తుడని, 40 ఏళ్లుగా ఆయన కుటుంబంతో అనుబంధం ఉందని చెప్పారు. అనంతరం వినోద్‌కుమార్ దుబే పాడెను కోలగట్ల మోశారు. అంతిమయాత్రలో పార్టీ జేసీఎస్ కన్వీనర్లు, జోనల్ ఇన్‌చార్జ్‌లు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మహిళకు రక్షణ లేకపోవడం సిగ్గుచేటు

విజయనగరం పూల్‌బాగ్: న్యాయవాది ఇంటిలోనే మహిళకు రక్షణ లేకపోవడం సిగ్గుచేటని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘ జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ గురువారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాది గోదావరి మధుబాబు ఆయన భార్య సుప్రియను 13 ఏళ్లు పాటు గదిలో బంధించి చిత్ర హింసలకు గురి చేయడం సరికాదన్నారు. మహిళల రక్షణ కోసం పోరాడాల్సిన న్యాయవాదులే ఇలా చేస్తే ఎలా అని ప్రశ్నించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు.

జరజాపుపేటలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారం చేపడుతున్న రామారావు, తదితరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేట 17, 18వ వార్డుల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం రాత్రి చురుగ్గా నిర్వహించారు. వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ ఎం వాసు, ఏఎంసీ డైరెక్టర్ పి. నారాయణమూర్తి, కౌన్సిలర్లు, నాయకులు ఇంటింటికీ తిరిగి, పట్టభద్రులను కలిసారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థగా భారత్

- పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి



ముఖ్య అతిథి బీవీఆర్ మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, తదితరులు

డెంకాడ: భారతదేశం ప్రపంచ స్థాయి ఆర్థిక వ్యవస్థగా మారిపోయిందని, దీనిని అందిపుచ్చుకుని యువత ఆత్మనిర్భర భారత్ దిశగా ముందుకు సాగాలని సైయెంట్ ఫౌండర్ చైర్మన్ పద్మశ్రీ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో సీఈఓ టాక్స్‌లో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రస్తుత కాలంలో చోటు చేసుకుంటున్న విప్లవాత్మకమైన మార్పులను అందిపుచ్చుకుని ముందుకు సాగితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. స్టార్టప్‌లు ఎలా ప్రారంభించాలి, కొత్త ఆలోచనలు కార్యరూపం దాల్చడానికి ఎలా వ్యవహరించాలన్న దానిపై విద్యార్థులకు వివరించారు. అనంతరం కళాశాల చైర్మన్ పి.మధుసూదనరావు, వైస్ చైర్మన్ పి.శ్రీనివాసరావు, సెక్రెటరీ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి ముఖ్యఅతిథి మోహన్‌రెడ్డిని దుశ్శాలువా కప్పి సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాష్‌బాబు, విభాగాధిపతులు రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, సతీష్‌పూజారి, దుర్గాశైలజ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

డెంకేషావలి బాబా దర్గా ముతావల్లిగా షేక్ బహుద్దూర్



షేక్ బహుద్దూర్

విజయనగరం టౌన్: కోట జంక్షన్ వద్దనున్న డెంకేషావలీ బాబా ఆలయ ముతావల్లిగా (ధర్మకర్త) షేక్ బహుద్దూర్‌ని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ గురువారం ఆదేశాలు జారీచేసింది. బహుద్దూర్ ఎంపికపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలి



సురేందర్‌కి వినతిపత్రం అందజేస్తున్న బీసీ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావు కోరారు. ఈ మేరకు ఎస్పీ, ఆర్‌టీఓ కార్యాలయం కమిషనర్ వడ్డే సురేందర్‌లను గురువారం కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, మజ్జి అప్పారావు, ఎస్ఎస్ రెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

క్రైస్తవ సంస్థ ఆస్తులు అన్యాక్రాంతం

విజయనగరం క్రైమ్: జిల్లా వ్యాప్తంగా క్రైస్తవ సంస్థ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికి వర ప్రసాదరావు అన్నారు. నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో సంఘ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దాసన్నపేట కుమ్మరివీధిలో ఉన్న డబ్ల్యూఎంఈ అనే సంస్థకు చెందిన భూమి కబ్జాకు గురైందన్నారు. అలాగే క్రైస్తవ సంస్థలకు చెందిన ఎన్నో విలువైన స్థలాలను ఆక్రమించుకుంటున్నారని, అధికారులు స్పందించి సంస్థల ఆస్తులను కాపాడాలని కోరారు.

కార్పొరేట్ కంటే మిన్నగా...



రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముఖద్వారం

మండలంలోని రఘుమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రభుత్వం కార్పొరేట్‌కు మిన్నగా అభివృద్ధి చేసింది. నాడు-నేడు పథకంలో భాగంగా రూ. 76 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టింది. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పించడంతో పాటు భవనాలను సుందరంగా తీర్చిదిద్దడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం పాఠశాలలో 391 మంది విద్యార్థులు చదువుతున్నారు. అభివృద్ధి చెందిన పాఠశాలను చూసి ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– డెంకాడ



తరగతి గదిలో బెంచీలపై విద్యార్థులు



సుందరంగా పాఠశాల భవనం



రఘుమండ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కళావేదిక

గ్యాస్ ధరల పెంపు దారుణం



నెల్లిమర్ల రూరల్: కొండగుంపాంలో నిరసన తెలియజేస్తున్న సీపీఐ నాయకులు



విజయనగరం పూల్‌బాగ్: నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

నెల్లిమర్ల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎప్పటికప్పుడు వంట గ్యాస్ ధరలు పెంచడం దారుణమని సీఐటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు కిల్లంపల్లి రామారావు అన్నారు. గ్యాస్ ధర పెంపునకు నిరసనగా స్థానిక జరజాపుపేట రహదారిలో విద్యుత్ స్టోర్స్ హమాలీలతో కలిసి గురువారం నిరసన చేపట్టారు. గతంలో రూ. 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 1150 రూపాయలకు చేరుకుందన్నారు. మోదీ సర్కార్ పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూర్చడం కోసం పేదల నడ్డివిరుస్తోందని ఆరోపించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి గ్యాస్ ధరలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో గోవింద్, రాంబాబు, శ్రీను, లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

సామాన్యుడి నడ్డి విరుస్తోంది..

నెల్లిమర్ల రూరల్: మోదీ సర్కార్ సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు ఆరోపించారు. గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ కొండగుంపాంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ, గ్యాస్ సిలిండర్‌పై ఒక్కసారిగా 50 రూపాయలు పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే గ్యాస్‌పై సబ్సిడీని ఎత్తి వేశారని.. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచడం అన్యాయమన్నారు. కేంద్రం తక్షణమే పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సూరి, సత్యనారాయణ, తవిటినాయుడు, పైడినాయుడు పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలు తగ్గించాలి..

విజయనగరం పూల్‌బాగ్: పెంచిన వంట గ్యాస్ ధరలు తగ్గించాలని సీపీఎం నగర కార్యదర్శి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని రామకృష్ణానగర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, 400 రూపాయలుండే గ్యాస్ సిలిండర్ ధర తాజాగా 1150 రూపాయలకు చేరుతుందన్నారు. పెంచిన ధరను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రమణమ్మ, శాంతమూర్తి, తదితరులు పాల్గొన్నారు.